# ప్రేమ - హత్య - తర్వాత

మురుమద్దాలి విజయలక్ష్మి

"హత్య చేయటం అతి తేలిక కాని.... సమయం కలిసిరావాలి కదా?"

ఇదేమాట తెల్లారి లేచిం తర్వాత ఇప్పటికి ఏ వందసార్లో అనుకున్నాను.

ఉదయం బావ తొడమీద కూర్చుని కునుకుతున్న శకుంతల రూపమే పదే పదే కనిపిస్తూ నా మనసుని మండిస్తున్నది. నాకే కాదు నా స్థితిలో వున్న ఎవరికయినా సరే హృదయం భగ్గు మనక మానదు అవంతే.

అమ్మా నాన్నా లేని నేను అమ్మమ్మ ఇంట్లో పెరగక తప్పలేదు. చదువుకునే రోజుల్లో అమ్మమ్మ స్వర్గస్తురాలు కావటంతో నా మకాం మేనత్త వాళ్ళింట్లోకి మారింది. అత్తకొడుకు పద్నాలుగేళ్ళ రవిబావ నేను ఆటల్లో పాటల్లో చదువులో కలిసిపోయాము. అత్తయ్య మంచిది. రవిబావ అంతకన్నా మంచివాడు ఆ రోజులు హాయిగా వుండేవి.

బావ పెద్ద వాడయాడు. బావని చూడంగానే హీరోలా వుండేవాడు. గుణంమాత్రం అలా గంభీర్యమూర్తి కాదు. చిలిపిగా నానా అల్లరి చేసేవాడు. నాకు బావంటే ఎంత ప్రాణమో బావకి నేనంటే అంత ప్రాణం.

ఇలా అని నే అనుకున్నాను. మోసపోయాను. సమయం వచ్చిందాకా తెలియ లేదు.

నన్ను బావకిచ్చి పెళ్ళిచేసి నన్ను తన కోడలిగా చేసుకోవటం అత్తయ్యకిష్టం లేదేమో బావకి పరాయి సంబంధాలు చూడటం మొదలు పెట్టింది. ముసుగులో గుద్దులాట దేనికి, డైరెక్ట్‌గా బావనే అడగదలుచుకున్నాను. ఓరోజు బావ ఓ పెళ్ళి కూతురిని చూడటానికి బయలుదేరుతుంటే ఇదే తగిన సమయం అనుకున్నాను.

"బావా! నేనంటే నీకిష్టమేనా?" బావని పరీక్షగా చూస్తూ ముక్కుసూటిగా అడిగాను.

"ఇదేం ప్రశ్న చంచలా?" చిలిపిగా నవ్వుతూ అడిగాడు బావ.

"నిజం కావాలి. నేనంటే నీకెలాంటి ఇష్టమో నీనోటంటవిని ఆనందిద్దామని....?"

"నువ్వంటే చాలా ఇష్టం చంచలా? చిన్నప్పటినుంచీ నాకో చెల్లులుంటేబాగుండును అనుకునే వాడిని. అమ్మ నన్నొక్కడినే కని వూరుకుంది. నాకు నీవు వరసకి చెల్లెలివి కాక పోయినా చెల్లెలిలా చూసుకున్నాను. నా పక్కనుండి ఆ కొరత తీర్చావు." నా భుజం మీద చెయ్యేసి ప్రేమగానిమురుతూ అన్నాడు బావ.

బావ మాటలు షాక్‌లా తగిలాయి. బావ నన్ను ముట్టుకుంటే ఎలాగ... ఏదో అర్థం తీసుకుని ఎన్నో ఆలోచించేదాన్ని. నా కలలూ బావ అన్న దానితో పగటి కలలయాయి. నా ఆశలు పేక మేడల్లా కూలిపోయాయి.

బావ అప్పుడు వెళ్ళి చూసొచ్చిన సంబంధం ఖాయం అయింది. పెళ్ళి కూతురు శకుంతల చాలా నచ్చిందట బావకి. వాళ్ళిచ్చే కట్నం నచ్చింది మామయ్యకి. వాళ్ళిచ్చే లాంఛనాలు నచ్చాయి అత్తయ్యకి. ఏదీ నచ్చందినాకే, అభాగ్యురాలిని. తల్లీ తండ్రీ లేని. దిక్కులేని దాన్ని. నాగోడెవరికి కావాలి? ఏ ఆధారమూ లేనిదాన్ని కాబట్టి నా దుఃఖం నాలోనే దాచుకుని మిన్నకుండి పోయాను.

ఓ దుర్‌ముహూర్తాన (నా దృష్టిలో ఆ ముహూర్తం అలాంటిదే) శకుంతల బావ పెళ్లాం అయిపోయింది.

శకుంతల కాపురాని కొచ్చింది. మరో దుర్ ముహూర్తాన.

శకుంతల కలివిడిగా వుండేదికాదు. మితభాషి. తానే అందగత్తెనని గర్వం. గీరగ ఉండేది. నేను బావతో గలగల మాట్లాడితే చాలు తీవ్రంగా చూసేది. వెధవ ఏడుపు మొహంది అదీను.

ఆఫీసునుండి బావ ఇంటికి రావటం ఆలశ్యం కాఫీ కప్పుతో బావ గదిలోకి వెళ్ళి బావ తొడమీద కూర్చుని బావ నోటికి కాఫీ అందించేది. ఇతరులు వింటారని సిగ్గు లేకుండా కిలకిల నవ్వుతూ గట్టిగా మాట్లాడటం. ఎన్ని వెధవపనులు చేయాలో అన్నీ చేసేది శకుంతల.

శకుంతల చేష్టలు. అది నన్ను చూచే చూపులు భరించటం రోజు రోజుకీ నాకు చాలా బాధగా వుంది. పైగా కాపురానికి వచ్చిన మూడో నెలలో నెల తప్పింది. నెల తప్పి అప్పుడే అయిదు నెలలు అయింది. బావ అత్తయ్య శకుంతలని కాలు కింద పెట్టనిచ్చేవారుకాదు. నడిస్తే అరిగి పోతుందన్నట్లు చూసేవారు. నేనొకదాన్ని న్నానని పూర్తిగా మర్చిపోయారు.

శకుంతల కడుపుతో వుంది. కనలేక చచ్చిపోతే? ఎంత హాయి! కొన్నాళ్ళు బావ విచారంతో వుంటాడు. తను బావని ఓదారుస్తూ బావకి బాగా దగ్గర కావాలి. ఈ తఫా బావ పరాయి ఆడదాని సొత్తు కారాదు. నా వేపు తిప్పుకుని నన్నే పెళ్లాడేటట్లు చేసుకోవాలి.

శకుంతల హాయిగా ప్రసవించి పండంటి బిడ్డను కంటే? అమ్మో! ఇంక ఇంట్లో అందరికీ పట్టపగ్గా లుంటాయా? అప్పుడు నా గతి?

"శకుంతల చావాలి!"

"చావదు."

"కాదు. అది చావాల్సిందే, చస్తేనే నా కడ్డు లేకుండా వుంటుంది. నా జీవితం హాయిగా వుంటుంది."

"చావకపోతే?"

"అవును చావకపోతే? ఆ .... చంపాలి నేను శకుంతలని చంపటం....?"

కాసేపు తర్జన భర్జనతో తీవ్రాలోచన చేశాను. శకుంతల చస్తుందని రూఢీలేదు. కాబట్టి నా మార్గానికి అడ్డు తొలగించుకోవాలంటే శకుంతల ప్రాణం తీయక తప్పదు. చివరికి ఏదో ఓ మార్గాన శకుంతలని పైలోకానికి పంపించదల్చుకున్నాను. నా నిశ్చయం. మౌనముగాక మారదు.

హత్య చేయటం అతి తేలిక. ఆపె పట్టుబడకూడదు. నే చూసిన క్రైమ్ సినిమాల్లో హత్యలన్నీ కళ్ళముందు కదులాడాయి. నే చదివిన డిటెక్టివ్ సాహిత్యమంతా గుర్తుకొచ్చింది. సమయానికి ఒక్కటీ ఉపయోగపడేటట్టులేదు. సినిమాలు చూడటానికి డిటెక్టివ్ స్టోరీస్ చదవటానికి తప్ప నాకు కించిత్ ఉపయోగపడేటట్లు లేవు.

రోజులు గడిచిపోతున్నాయ్. శకుంతలని చంపాలనే కోరిక రోజు రోజుకి బలపడుతున్నదేగాని ఆచరణలో శూన్యం,

దొడ్లో చప్టామీద ఓ పక్క పల్లం వుండి అక్కడ నీరు తడారక పాచి పట్టింది, ఓ రోజు శకుంతల ఆ పాచిమీద కాలేసి జారబోయి నిలదొక్కుకుంది. అది అత్తయ్య చూచింది "అమ్మో, అమ్మో, ఇంకేమైనా వుందా? ఉట్టిమనిషివి కూడా కాదు. పడితే ఎంత ప్రమాద మయేది? ఆ దేముడే నిన్నూ, నా పుట్టబోయే మనవణ్ణి రక్షించాడు. నడుంగాని, కాలుగాని నెప్పి పెట్టలేదుకదా?" అంటూ పాఠం చదివింది అత్తయ్య.

వెంటనే నా బుర్రలో ఫ్లాష్‌లైట్ వెలిగింది.

ఇప్పుడు శకుంతల ఉట్టిమనిషి కాదు. జారిపడితే పెద్దప్రాణమో, చిన్నప్రాణమో గుటుక్కుమవటం ఖాయం. శకుంతల గుటుక్కుమంటే చిక్కే లేదు. లేక కడుపు పోతే విషాదం. శకుంతల అనారోగ్యం. ఏదో ఒకటి ప్రస్తుతం జరగాల్సింది శకుంతల జారిపడటం

శకుంతల జర్రున జారే మహత్తర కార్యం నా వల్ల జరగాలి.

ఎలా?

తీవ్రంగా ఆలోచించాను.

నా బుర్రలో మరోసారి ఫ్లాష్‌బల్బ్ వెలిగింది,



రోజూ సాయంత్రంపూట శకుంతల డాబాఎక్కి డాబా మీద పావుగంటసేపు పచార్లుచేసి కిందకు దిగుతుంది. గర్భిణీ స్త్రీలు నెమ్మదిగా రోజూ కొంతదూరం నడవటం మంచిదని డాక్టరు చెప్పింది. రోజూ బైట షికారు బదులు డాబామీదనే అటూ ఇటూ నడుస్తున్నది శకుంతల

ఆ రోజు శకుంతల డాబా ఎక్కింది. బావ బైటనుంచి ఇంకా ఇంటికి రాలేదు. మామయ్య ఇంట్లో లేడు. అత్తయ్య వంటగదిలోవుంది, నాకు సమయం కల్సివచ్చింది. రహస్యంగా నే తెచ్చి పెట్టిన ఆముదంసీసా తీసుకున్నాను. డాబా పదిమెట్లు పైకెక్కాను. మూడు నాలుగు మెట్లమీద కొద్దిగా అముదం పోశాను ఏ మాత్రం ఆలశ్యం చేయకుండ వంటగదిలోకి వచ్చి వంటలో అత్తయ్యకి సహాయంచేస్తూ వుండిపోయాను.

నా ప్లాన్ సక్‌సెస్ అయి శకుంతల డాబా దిగుతూ జారిపడితే హరీ అనటమో కడుపు పోవటమో కాలిరగటమో జరుగుతుంది. శకుంతల పడకపోతేమాత్రం నా దురదృష్టమే. శకుంతల పడితే నే తీసుకోవలసిన జాగ్రత్తలు ఎవరూ చూడకుండా మెట్ల మీద అముదం తుడిచెయ్యాలి. అంతే. మెట్లమీద ఆముదం చుక్కలు వేశాను. అది చాలు జర్రున జారిపడటానికి. గిద్దెడు ఆముదం పోయక్కరలేదు. కాపోతే శకుంతల కాలు సరీగ ఆ చుక్కలమీద పడితేచాలు....

నా ఆలోచన కంతరాయం కలిగిస్తూ "అమ్మో!" అన్న శకుంతల గావుకేక వినపడింది.

వంటగదిలోంచి అత్తయ్య, నేను బైటికి పరుగెత్తాము.

శకుంతల ఆముదం చుక్కలమీద కాలేసిందేమో మెట్లమీదనుంచి దొర్లుబుచ్చకాయలాగా దొర్లి కింద పడివుంది "అమ్మా!" అని అరుస్తూ పొట్టపట్టుకు గిల గిల కొట్టుకుంటున్నది.

ఆచరణలో పెట్టంగానే నా ప్లాన్ సక్‌సెస్ అయింది భగవంతుడు నా యందున్నాడు.

అత్తయ్య లబ్బున నెత్తినోరు బాదుకుంది. అప్పుడే బైటనుంచి బావొచ్చాడు. అత్తయ్య, బావ ఏమాత్రం ఆలశ్యం చేయకుండ శకుంతలని హాస్పిటల్‌కి తీసు

కెళ్ళారు. ఇంట్లోవున్న నేను తలుపు తీసుకుని చక చక మెట్లమీద ఆముదం తుడిచి వేశాను. ఇహ చూడాలి ఏమవుతుందో!

మెట్లమీదనుంచి జారిపడటంవల్ల శకుంతలకి ఎబార్షన్ అయింది. ఫిట్లొచ్చాయి. ఎబార్షన్‌కి ఎమర్జెన్సీ ఆపరేషన్ అవసరమయింది. మొత్తానికి శకుంతల పరిస్థితి ప్రమాదకరం వుంది.

ఆపరేషన్ చేయటంవల్ల శకుంతల ప్రమాదంనుంచి బైటపడిందిట. బెడ్‌మీదకి తీసుకొచ్చి పడుకోబెట్టారు. శకుంతలకింకా తెలివిరాలేదు. మత్తుమందు ప్రభావం మరో రెండు గంటలుంటుందని .... ఎక్కువ బ్లీడింగ్ పోవటంవల్ల చాలా వీక్ అయిందని.... జాగ్రత్తగా చూస్తూ ఓ మనిషి శకుంతల పక్కనే వుండాలని, పైగా శకుంతలకి ఉన్నట్లుండి బాగా టెంపరేచర్ వచ్చిందని.... శకుంతలకి తెలివిరాగానే వెంటనే తనతో వచ్చి చెప్పమని.... మరికొన్ని జాగ్రత్తలూ చెప్పి డాక్టర్ వెళ్ళిపోయాడు.

అత్తయ్య బి.పి. పేషంట్. జరిగిందానివల్ల అత్తయ్య బి.పి. పెరిగింది. తల తిరుగుతుందంటూ కళ్ళుమూసుకు కూర్చుంది.

సమయానికి మామయ్యతోనే ఆసుపత్రికి రావటం మంచిదే అయింది. నన్ను శకుంతల బెడ్‌వద్ద కాపలావుంచి అత్తయ్య, మామయ్య ఇంటికి వెళ్ళారు. శకుంతలకి ఆసుపత్రిలోకి కావల్సినవి తేవటానికి బావ ఇంటి కెళ్ళాడు. వెళ్ళేటప్పుడు నా కెన్నో జాగ్రత్తలు చెప్పి మరీ వెళ్ళాడు.

నేను, మైకంలో వున్న శకుంతల మిగిలాం.

శకుంతలని చూస్తుంటే నా మెదడులో మరో సారి ఫ్లాష్ బల్బు వెలిగింది.

చుట్టూ చూశాను.

అది స్పెషల్ వార్డుకాదు. మామూలు వార్డు. ఆ వార్డులో పది మంచాలున్నాయి. అన్ని మంచాలు పేషంట్లతో నిండి వున్నాయి. పేషంట్స్ తాలూకా మనుషులు వున్నారు

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఏనాడో చదివిన ఓ క్రైమ్ కథ గుర్తొచ్చింది మనసు నిబ్బరపర్చుకున్నాను. పేషంట్ల తాలూకు మనుషులు పేషంట్లతో మాట్లాడుతున్నారు. ఎవరి గోల వాళ్ళది.

పదిమంది పేషంట్లువుండే వార్డులో స్టాండ్‌కి బిగించిన స్క్రీన్‌లు వుంటాయి. స్టాండుకి చక్రాలుంటాయి. పేషంట్‌కి డ్రస్ చేసేటప్పుడు, బెడ్‌మీదనే వంటిమీద బట్టలు తొలగించి పరీక్షించేటప్పుడు, పేషంట్ పాస్‌పోసుకోవాలన్నా ఇతరులు చూడకుండా ఆ స్క్రీన్ అడ్డుపెట్టుకుని పని జరుపుకుంటారు. చక్రాలున్న ఆ స్క్రీన్ ఎవరికి అవసరమయితే వాళ్ళు తెచ్చుకుని పని ముగియంగానే అవతలికి జరుపుతారు. ఆ స్క్రీన్‌తో యిప్పుడు నా కవసరం పడింది.

స్క్రీన్ తీసుకొచ్చి శకుంతల బెడ్‌కి అడ్డంగా పెట్టాను. ఓసారి ఇవతలికొచ్చి అందరినీ పరికించి చూశాను నన్నెవరూ

ఇన్‌స్టెంట్ గ్యాస్ లైట్


కరెంటు కొరత రోజుల్లో షాపుల్లోనూ, ఫ్యాక్టరీలలోనూ, ఆఫీసులలోనూ, ఆసుపత్రులలోనూ, వివాహాలలో, ఉత్సవాలలో కాంతి వలయం, జ్యోతిర్మయం.

మినీ గ్యాస్ స్టవ్

మహిళ కొక మణిభూషణం, విందులలో.
వినోదాలలో, విలాస యాత్రలలో కాంతివెల్లువ

RAMAKRISHNA ENTERPRISES

TILAK ROAD : : KAKINADA.




గమనించలేదని గట్టిగా రూఢి చేసుకున్నాను ఆలశ్యం అమృతం విషం అన్నారు పెద్దలు పెద్దలమాట నిజం కాబట్టి చకచక నా పని మొదలు పెట్టాను.

శకుంతల తలకింద దిండు తీశాను. ఆ దిండుతో శకుంతల ముఖం మీద గట్టిగా నా బలమంతా ఉపయోగించి అదిమివుంచాను.

మైకంలోవున్న శకుంతలకి చావు తెలివొచ్చిందేమో ఊపిరాడక కొట్టుకున్నట్లు కదులాడి వెంటనే ఆగిపోయింది నా శరీరమంతా చెమట పట్టింది. ఎవరిదో అడుగుల చప్పుడు....గబుక్కున శకుంతల ముఖం మీద దిండుతీసి శకుంతల తలకింద పెట్టాను. ఎవరో అయిదో నెంబరు బెడ్ మీద రోగిని చూడటానికి కెళుతున్నారు వాళ్ళ అడుగుల చప్పుడది. అమ్మయ్య అనుకుని తాపీగ శకుంతల ముఖం చూశాను. ఇంకెక్కడి శకుంతల బావ నన్యాయంచేసి తనదారి తాను చూసుకుంది.

నే చేసిన పనిలో పొరపాటేమయినా దొర్లిందేమో అని ఆలోచించాను. ఏ పొరపాటూలేదు. ఓ అయిడియా వచ్చింది మంచం కిందనున్న బెడ్ పాన్ అందుకున్నాను. చేయవలసిందిచేసి బెడ్ పాన్ని మంచంకింద పెట్టాను. ఆ తర్వాత స్క్రీన్ తోసుకుంటూ వెళ్ళి గోడపక్క యధాస్థానంలో పెట్టివచ్చాను. అంతా అయిదు నిముషాలలో అయిపోయింది. హత్య చేయటం అతి తేలిక. తృప్తిగా అనుకున్నాను.

పక్క బెడ్ లోవున్న పేషంటుని మాట్లాడిస్తూ మధ్య మధ్య శకుంతలకి తెలివొచ్చిందో లేదో అని చూస్తూ ఆదుర్దా కనపరుస్తూ నటిస్తూవుండిపోయాను. ఇప్పుడు నేనెంత సహజంగా నటిస్తే అంత మంచిది. శకుంతలంటే నాకెంత ప్రాణమో కథలా చెపుతున్నాను పక్క బెడ్ పేషంటుకి. నా ఆతృత, నా ఆలోచన వేరు. నేను చెప్ప కూడదు. ఎవరో ఒకరు శకుంతలని ముందుగాచూసి మరణించిందని చెప్పాలి. అప్పుడు నే శోకాలు పెట్టాలి. మత్తు విడవకుండానే శకుంతల మామూలుగా మరణించిందని డాక్టరు చెపితే బస్ పనయిపోతుంది. నా లైన్ క్లియరవుతుంది. శకుంతల పిడికెడు బూడిదవుతుంది.

బావ యెప్పుడొచ్చాడో తెలియదు. ముందు యిక్కడికి రాకుండా డాక్టరు వద్దకెళ్ళాడు కాబోలు డాక్టరు బావ కలసి వస్తున్నారు. వాళ్ళని నే చూడనట్లు పక్క బెడ్ పేషంటుతో ఇంకా మాట్లాడుతూ నేవున్నాను. వాళ్ళు దగ్గరకు రాంగానే అప్పుడే వాళ్ళని చూసినట్లుగా "శకుంతల కింకా స్పృహ రాలేదు డాక్టరుగారూ!" అన్నాను.

బావ చేతులు పట్టుకుని బెడ్ కి కాస్త దూరంగా నుంచున్నాడు.

శకుంతలను చూస్తూనే డాక్టరు కంగారు పడ్డాడు.

శకుంతల చెయ్యిపట్టి చూశాడు. కను రెప్పలెత్తి చూచాడు ఇంకేవో పరీక్షలు చకచకా చేశాడు. "ఓ....గాడ్, షి యీజ్ డెడ్" అన్నాడు. ఆయన ముఖం పాలిపోయింది.

"ఏమయింది ? ఏమయింది ?" నా ఆదుర్దా వ్యక్తం చేశాను.

ఆవార్డ్ అంతా ప్రతిధ్వనించేటట్లు "శకూ!" అంటూ గావుకేక పెట్టాడు బావ.

వెంటనే బావను పట్టుకుని ఓదార్చటం మొదలుపెట్టాను నేను.

"ఇంపాజిబుల్, ఇంపాజిబుల్." డాక్టర్ తల విదిలించి గొణిగాడు.

బెడ్స్ మీద విశ్రాంతిగా పడుకున్న పేషంట్లు బెడ్స్ మీద లేచి కూర్చున్నారు. పేషంట్స్ తాలూకా బంధువులు మా చుట్టూ గుమిగూడారు.

"శవాన్ని ఎవరూ ముట్టుకోకండి...." ఆర్డర్ జారీచేసి నర్స్ తో ఏదో గుసగుసలాడి శకుంతల బెడ్ వద్ద నర్సుని కాపలా పెట్టి బూట్లు టకటక లాడించుకుంటూ డాక్టర్ అవతలి కెళ్ళిపోయాడు.

"డాక్టరు సరిగా ఆపరేషన్ చెయ్యలేదేమో బావా ?" బావని ఓదారుస్తూ అన్నాను.

కొద్దిసేపు తర్వాత డాక్టరు, పోలీసులు, ఇన్ స్పెక్టరు మరి కొందరు వచ్చారు.

వాళ్ళందరినీ చూడంగానే నా గుండెలో కేసడా ఇంజన్ తగిలించుకున్న రైళ్ళు పరుగెత్తటం మొదలుపెట్టాయి.

బావ ఏడుపు మర్చిపోయి. "ఏం జరిగింది!" అంటూ నిర్ఘాంతపోయాడు.

"చూస్తూ వుండండి." కటువుగా అని డాక్టరు నా వేపు తిరిగాడు. "ఇన్ స్పెక్టరుగారు ఇప్పుడు అడిగే వాటికి జవాబివ్వండి" అన్నాడు

అయోమయంగా తలవూపాను.

ఇన్ స్పెక్టరు శకుంతల బెడ్ దగ్గరగా నుంచుని శకుంతలని పరీక్షగా చూసి డాక్టరుతో గుసగుసలాడేడు. కొందరిని పక్కకి తీసుకెళ్ళి మాట్లాడు. ఆ తర్వాత నా దగ్గర కొచ్చాడు.

"ఆపరేషన్ అయి శకుంతలని బెడ్ మీదకి చేర్చిం తరువాత ఎవరైనా రావటం కాని నీవు శకుంతలని కదిలించటంగాని జరిగిందా ?" ఇన్ స్పెక్టరు నా కళ్ళల్లోకి గుచ్చి చూస్తూ అడిగాడు.

"లేదు" జాగ్రత్తగా జవాబిచ్చాను.

"స్క్రీన్ కదిపావా?"

"లేదు. అహహ పొరపాటు. ఓసారి స్క్రీన్ తీసుకొచ్చాను." నా తడబాటుకి నన్ను నేనే తిట్టుకున్నాను లోలోన.

"దేవికి."

"శకుంతలకి కొద్దిగా తెలివొచ్చింది. పాస్ పోసుకుంటానంది స్క్రీన్ అడ్డు పెట్టి బెడ్ పాన్ పెట్టాను. కొద్దిగా పాస్ పోసింది. మళ్ళీ మత్తులో పడిపోయింది. పూర్తిగా తెలివి రాలేదని ఎదురు చూస్తూ ఈ పక్క పేషంటుతో మాట్లాడుతూ వుండిపోయాను. ఈ ప్రశ్నలన్నీ నన్నెందుకు అడుగుతున్నారు" ధైర్యం తెచ్చుకుని అడిగాను.

"శకుంతలది సహజ మరణం కాదు. హత్య."

"హత్యా! నేఇక్కడే వున్నాను. ఎవ రొచ్చి హత్య చేశారు? మైకంలో మరణించి వుంటుంది. మైకం తిప్పుకోలేక ..."

"ఇందాక తెలివొచ్చిందన్నావ్?"

"ఆ.... ఆ రావటం అంటే పూర్తి తెలివికాదు. పాస్ కెళతానని గొణిగినట్లయింది బెడ్ పాన్ పెట్టాను.

"పాసుపోసిందా?"

"ఆ.... పోసింది."

"అంటే అప్పుడు బతికే వుంది అవునా"

"అవునవును."

"కాబట్టి ఆ తర్వాతే హత్యచేయబడింది అనుకోవాలి."

"నే ఇక్కడే వున్నాను. హత్యెవరు చేస్తారు; మైకం తిప్పుకోలేక మరణించి వుంటుంది." తెలివిగా అన్నాను.

"ఓసారి తెలివొచ్చిందిగా?"

"పూర్తి తెలివిరాలేదు" గొణిగింది

"ఏమని?"

అడిగే వెనక ప్రశ్నలకి లోలోపల మండి పోతున్నా ఎదురుగా వుండి అడుగుతున్నది. ఇన్‌స్పెక్టరు కావటంతో నన్ను నేను కంట్రోల్ చేసుకుంటూ జాగ్రత్తగా జవా బిచ్చాను. "పాస్. పాస్.... అన్నట్లయింది. అలానే వినిపించింది."

"నువ్వు దిండు తీస్తుంటే ఆ మనిషి ఇలెళుతూ చూసిందిట—"

"చూసిందా?"


"శకుంతల తల కింద దిండెందుకు తీశావ్?"

"అది.... అది.... సరిగ సర్దిపెట్టా అంతే."

"దిండు ముఖాన పెట్టావు?"

"లేదు లేదు"

"ఆ మనిషి చూసింది."




"ఎవరూ చూడలా. నే చూస్తూనేవున్నా జాగ్రత్తగా."

"జాగ్రత్తదేనికి?"

అప్పటికే నాలుక కొరుక్కుని మిన్న కుండిపోయాను.

"శకుంతల నెందుకు హత్యచేశావ్?"

"నే చెయ్యలేదు."

"నువ్వే ఈ హత్య చేశావు. తొందరలో నీవు చేసిన పొరపాటు నీవీ హత్య చేసినట్లు నిరూపిస్తున్నది."

"పొరపాటా? నేనేం చెయ్యలేదు." టక్కున అన్నాను.

"ఇది మరో పొరపాటు." అంటూ ఇన్‌స్పెక్టరు నా దగ్గర కొచ్చి హాండ్‌కఫ్స్ తీశాడు.

బిత్తరపోయి వెంటనే తెలివి తెచ్చుకున్నాను. కాళ్ళూ చేతులూ వణకిపోతున్నాయి. వళ్ళంతా ముచ్చెమటలు పోస్తున్నాయి. నోరు తడారి పోతున్నది. అయినా "నేనేం పొరపాటు చెయ్యలేదు. అసలీ హత్యేచెయ్యలేదు.చెప్పి అరెస్టు చేయండి." అన్నాను తెచ్చి పెట్టుకున్న గంభీర్యంతో.

"చెప్పే చేస్తానుడాక్టరు. మీరు కానీండి" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"ఇదంతా ఏమిటి?" బావ అడిగాడు అప్పుడు పెదవి కదిపి.

"వినండి మీకే అర్థమవుతుంది. పేషంటుకి అసలు తెలివే రాలేదు. నా లెక్క ప్రకారం ఇంకో పావుగంట పైనగాని తెలివి రాదు. అలాంటిది పేషంటు గొణిగిందని పాసు పోసిందని తను బెడ్ మీద పాన్ పెట్టానని చెప్పింది. పేషంటుకి డి.యన్.సి. చేసి ఎడుకో బెట్టటం జరిగింది. బాధ తెలియకుండా నిద్రపట్టటానికి ఇన్‌జక్షన్ ఇచ్చాము. పేషంటు ఎట్టి పరిస్థితిలోను లేచి పాస్ కెళ్ళదు. బెడ్‌పాన్‌లో పాసు పరీక్ష చేస్తే ఆ పాసు ఎవరిదైందీ తెల్సిపోతుంది. పేషంటుని చూసేసరికి మరణించివుంది. ఎబార్షన్ కావటం మినహా పేషంటు పరిస్థితి ప్రమాదకరంగాలేదు. మరి ఎలా మరణించింది? పేషంటుని చూస్తుంటే నాకో క్లూ లభించింది. ఇది సహజ మరణంకాదని ఇన్‌స్పెక్టరుకి ఫోన్ చేశాను" అంటూ డాక్టరు ఇన్‌స్పెక్టరు వేపు చూశాడు.

"అవును. ఇది సహజ మరణం కాదు. కొత్త బుర్ర వుపయోగించి పేషంట్‌ని దిండును చూస్తే హత్య ఎలా జరిగిందీ తెల్సిపోతుంది. పేషంట్‌ను శకుంతలని హత్య చేయటానికి ఈమె స్క్రీన్ అడ్డు పెట్టుకుని పదిమంది మధ్యలో ఈజీగ ధైర్యముగా పని కానిచ్చింది. పేషంట్ తలకింద దిండు తీసి పేషంటు ముఖాన బలంగా నొక్కి వుంచింది. శ్వాసాడక ఎదురించే శక్తిలేక గిజ గిజ కొట్టుకుని పేషంటు మరణించింది. పేషంట్ మరణించేముందు తలకదిలించటంవల్ల ఆమె నుదుట కుంకం చెదిరింది. అలా చెదిరిన గుర్తు ఆమె ముఖం మీదవుంది. చెదిరిన కుంకం గుర్తు దిండు మీద పడింది. పేషంట్ ముక్కుపుడక ముక్కుకి గట్టిగా పెట్టి లేదేమో పుడక దిండులో గుచ్చుకుని వుంది. పైగా మరో గుర్తు పేషంట్ ఉదయం పసుప ముఖానరాసుకుని తలారా స్నానంచేసినట్లుంది. పసుపు మరకలు దిండుమీద చక్కగా పడ్డాయి. పేషంట్ కదిలే పరిస్థితి కాదు. పరిస్థితి సీరియస్‌కాదు పేషంట్ ఇలా వున్నప్పుడు ఎలా మరణించింది? ఇది సహజ మరణం కాదని తెలిసి పోతున్నది. ఎవరో దిండుని పేషంట్ ముఖాన బలంగా అదిమి ఉంచటంవల్ల ఊపిరాడక మరణించింది. ఇదిహత్య.

పేషంట్ సాక్ష్యంవదలి వెళ్ళింది. హత్య చేయటానికి కారణం ఏమిటో తర్వాత ఈమె నోట చెప్పిస్తాను." అంటూ ఇన్‌స్పెక్టర్ హాండ్ కప్పుతో నా దగ్గర కొచ్చాడు.

"తర్వాతెందుకు ఇప్పుడే చెపుతాను. హత్య మీరు వూహించిన విధంగానే నేనే చేశాను. బావమీద ప్రేమ, ఆ ప్రేమ శకుంతల సొంతమయిందనే ఈర్ష్య. శకుంతల కాలుజారి పడటానికి హత్య చేయటానికి పురికొల్పాయి. హత్య చేయటం అంత తేలిక దాచటం మాత్రం కాదు." అంటూ బావ ముఖం చూడలేక తలదించుకుని చేతులు జాపాను.

"ఓసి. రాక్షసీ!" బావ గావు కేక హాస్పిటలంతా ప్రతిధ్వనించింది.

ఇన్‌స్పెక్టర్ నా చేతులకి బేడీలు తగిలించాడు.


*With the Best Compliments from :*

Phone No. : 207

**YADA VAIKUNTAM GARI NARAYANA**

*Wholesale Dealer :*

**I. T. C. LIMITED**

*Distributors :*

**THE WESTERN INDIA MATCH CO., LTD.,**

POST BOX No. 2

8-11-66, PINNAVARI STREET,

**WARANGAL-506 002**

(S. C. RLY.)

*With the Best Compliments from :*

Phone : 174

**MANEPALLI SUBBA RAO**

**&**

**K. V. R. S. SUBBA RAO**

**GENERAL MERCHANTS**

All kinds of :

Threads, Cement, Asbestos Sheets, Biscuits, Sweets, Locks, Soaps, Matches and Battries etc.

*

21-92, Rashtrapathi Road,

TANUKU - 534211.